# ఉపోద్ఘాతం

కుర్చీ విలువ అది ఉన్న స్థానాన్ని బట్టి మారుతుంది. కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగుల హోదాలు వారు కూర్చున్న కుర్చీల వల్లే సంక్రమిస్తాయి. ఆయా హోదాలతో బాటు ఎన్నో బాధ్యతలూ ఉంటాయి, వాటికి తగిన అధికారాలూ ఉంటాయి. అధికార సద్వినియోగం, అధికార నిరుపయోగం, అధికార దుర్వినియోగం, బాధ్యతాయుతం, బాధ్యతారహిత్యం – ఈ అయిదు ఉప అంశాలూ ఆ కుర్చీలో కూర్చున్న వ్యక్తి సామర్థ్యానికి వివిధాలైన నిర్వచనాలిస్తాయి. కుర్చీలో కూర్చున్న వ్యక్తి వ్యక్తిత్వాన్ని బట్టి ఆ కుర్చీ ప్రతిభ పెరగవచ్చు, ఆ కుర్చీ అంటే గౌరవంతో కూడిన భక్తి లేదా భయంతో కూడిన భక్తి కలుగవచ్చు, కొన్ని విపరీత పరిస్థితుల్లో ఆ కుర్చీ అందరికీ లోకువా కావొచ్చు.

బల్లకివతలి కుర్చీలోంచి అవతలి కుర్చీలోకి మారినా, కింది అంతస్తు కుర్చీలోంచి పై అంతస్తు కుర్చీలోకి మారినా బాధ్యతల్లో మార్పు ఉంటుంది. ఆ మార్పుల కనుగుణంగా ఉద్యోగి దృక్పథమూ మారి తీరాలి. లఘు కోణ వీక్షణం గురు కోణ విశాల వీక్షణంగా మారాలి. బల్ల దగ్గరికి వచ్చిన సమస్యని ఎదుటివారి దృష్టితో కూడా పరిశీలించగలగాలి. యిది జరగనినాడు అసంతృప్తి తరంగాలు చిన్నగా మొదలై మహా కెరటాలుగా మారిపోతాయి.

కర్తవ్య నిర్వహణలో తల ఎత్తి, కార్యాలయానికే పరిమితమైన సమస్యల పరిష్కారం

సులువుగానే సాధించవచ్చు. కాని స్వార్థమూ, వ్యక్తిగతమైన మనస్పర్థలూ ఒక పక్కా, బాహ్యమైన స్థానిక, ప్రాంతీయ, రాజకీయ ఒత్తిళ్ళు మరొక పక్కా ఎప్పుడైతే రంగ ప్రవేశం చేస్తాయో, ఆ సంస్థ నడిచే బాటలో గోతులేర్పడతాయి. బాధ్యాతాయుతమైన దిళ్ళ కుర్చీలలో ముళ్ళు మొలుచుకొస్తాయి. అడుగడుక్కీ అడ్డంకులు కలిగించే అవతారాలకీ, అందరూ దొంగలే అన్న ప్రాతిపదిక మీద నిర్ధారించిన నియమాలకీ కొదవలేని కారణంగా, సంస్థల పురోగతికి పాటుపడేవారికి నిత్యశృంఖలాలు పడ్తూనే ఉంటాయి. గోటితో చేసే పనికి గొడ్డలితో ప్రయాసపడవలసి వస్తుంది.

నిర్ధారితమైన రీతిలో బాగు చేస్తే ఓ యంత్రం బాగుపడ్తుంది. నిర్ధారితమైన రీతిలో నిర్మాణం కావించబడ్డ వంద యంత్రాలు ఒక్క మీట నొక్కడంతో ఒకేలా పనిచేస్తాయి. వంద మాటలు చెప్పినా యిద్దరు మనుషుల్ని ఒకేలా పనిచేయించం చాలా కష్టసాధ్యం! బాధ్యతారాహిత్యమైన ఒక్క వ్యక్తిని సక్రమమైన మార్గంలో పెట్టడానికి ఎన్నో ప్రయత్నాలు చెయ్యాలి.

అయితే బాధ్యతాయుతమైన కుర్చీల్లో కూర్చున్నవాళ్ళందరూ యింతటి ప్రయాసలు పడవలసి వస్తుందా అంటే –

'ఎప్పటికేది ప్రస్తుతమో ఆ మాటలాడి, యితరుల నొప్పింపక, తన మనసును కష్టపెట్టుకోక తప్పించుకొనేవాడు ధన్యుడు' అంటాడు సుమతీ శతకకారుడు. యిది జారిపోయే గుణం అంటే Escapism.

యిక వేమనగారేమంటారంటే – 'ఆలోచించి పనిచేసేవారు తక్కువ. తంత్రములతో పని జరుపుకొనేవారు ఎక్కువ. ఈ తంత్రపు జనులు గారడి వాని బొమ్మలు వంటి వారు మాత్రమే!' ఈ మాటలూ సత్యదూరం కాదు. ఈ పంథాలో కొంతకాలం బండి నడిచినా ఎప్పుడో ఉన్నట్టుండి బండి బోల్తా పడ్తుంది.

'మేనేజ్‌మెంట్' అంటే 'ఎలాగో బండి నడిపించటం' అన్న భావార్థాన్ని తీసుకొంటే – మన దేశంలో అన్ని రంగాల్లోనూ జరుగుతున్నదదే. తమంతట తాముగా, తాము కూర్చున్న కుర్చీల బాధ్యతలు నిర్వహించకపోతే పెద్ద కుర్చీల్లో కూర్చున్నవారికి, సామ, దాన, భేద, దండోపాయాలు ఉపయోగించక తప్పదు. End justifies the means అనే ఆంగ్ల సూక్తి ఉంది. 'అంతిమ లక్ష్యాన్ని సాధించినప్పుడు అవలంబించిన మార్గాలు అనుచితం కాదు'. యిదీ చాలా చర్చనీయాంశమే! స్వలాభాపేక్ష లేకుండా నైతిక బలం ఉన్న వారికి ఒకలా, కాని వారికి మరోలా ఈ సూక్తి వర్తిస్తుంది.

సమస్యలు లేని సంస్థలుండవు. ఆలోచించవలసిన విషయం ఏమిటంటే – అవి వచ్చినవా, తెచ్చినవా? అని మాత్రమే!